సాక్షి కర్నూలు

ఆదివారం। 16। ఏప్రిల్। 2023



నాటక కళల కాణాచి

నాటక కళల కాణాచిగా కందనవోలు పేరుగాంచింది. జిల్లాలోని పలువురు కళాకారులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చి రంగస్థలాన్ని సుసంపన్నం చేశారు.

10లో ▸



మద్దిలేటయ్య క్షేత్రం కిటకిట

బేతంచెర్ల: మద్దిలేటయ్య క్షేత్రం శనివారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. చైత్ర మాసం సందర్భంగా భక్తులు తరలివచ్చారు. వివిధ సేవా టికెట్ల ద్వారా రూ. రూ.8.67 లక్షల ఆదాయం వచ్చింది.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన నరసింహన్ శనివారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. దాతకు ఆలయ విరాళాల బాండును అందజేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:38	ఉ॥ 4:38
ఆదోని	సా॥ 6:41	ఉ॥ 4:41
నంద్యాల	సా॥ 6:38	ఉ॥ 4:41
ఆత్మకూరు	సా॥ 6:36	ఉ॥ 4:35
బనగానపల్లె	సా॥ 6:41	ఉ॥ 4:35

హదీస్ వెలుగు :
తల్లిదండ్రులను గౌరవించండి. వృద్ధాప్యంలో అన్ని విధాలా అండగా ఉండండి. వారిని నిర్లక్ష్యం చేస్తే స్వర్గంలో ప్రవేశం కష్టతరం.
– పవిత్ర ఖురాన్

నెత్తుటి నేలపై పచ్చటి సంతకం

- హంద్రీ -నీవాతో మారుతున్న పల్లెలు
- చెరువులకు నీటి మళ్లింపు పథకంతో వ్యవసాయానికి ఊపిరి
- ఫ్యాక్షన్ వీడి సాగు వైపు రైతుల చూపు
- బోర్ల కింద పెరుగుతున్న సాగు విస్తీర్ణం

కృష్ణమ్మ జల పరవళ్లతో ఫ్యాక్షన్ గడ్డపై నెత్తుటి మరకలు చెరిగిపోతున్నాయి. నాడు వేటకొడవళ్లు పట్టిన చేతులు నేడు నాగళ్లు పడుతున్నాయి. కత్తులు కరాళ నృత్యం చేసిన చోటే నేడు జొన్న కంకుల పొత్తులు విచ్చుకుంటున్నాయి. బాంబుల మోతతో దద్దరిల్లిన పల్లెల్లో పొద్దు తిరుగుడు పువ్వులు విరబూస్తున్నాయి. హంద్రీ నీవా సుజల ప్రసంతి పథకంతో కరువు నేలలో కనుచూపు మేర పచ్చని పంటలు కనిపిస్తున్నాయి.

ఆలూరు: కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఒకప్పుడు ఫ్యాక్షన్‌తో అట్టుడికిన మండలం దేవనకొండ. పలు గ్రామాల్లో ఆధిపత్య పోరులో ఎంతో మంది బలయ్యారు. బతికితే చాలు అనుకుని ఊరి విడిచిన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అభివృద్ధికి దూరమైన పల్లెల్లో జీవనోపాధి ఎంతో కష్టంగా ఉండేది. అసలే వర్షాధార భూములు ఆపై సాగు చేసేవారు లేక ఏళ్ల తరబడి బీళ్లుగా ఉన్నాయి. అలాంటి భూములు ఇప్పుడిప్పుడు సాగుకు నోచుకుంటున్నాయి. హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం ఈ ప్రాంతానికి వరప్రదాయినిగా మారింది. దేవనకొండ మండలంలో 25 గ్రామ పంచాయతీలు, మరో 20 మజరా గ్రామాలు ఉన్నాయి. లక్షకు పైగా జనాభా ఉండగా ఇందులో 67,500 మంది ఓటర్లు ఉన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా 2004లో చేపట్టిన హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వ ఈ ప్రాంత సాగు, తాగు నీటి కష్టాలను తీరుస్తోంది. నందికొట్కూరు నియోజకవర్గంలో కృష్ణానది పరివాహక ప్రాంతం నుంచి మొదలై కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లా మీదుగా వెళ్లే ఈ కాలువ కరువు నేల గొంతును తడుపుతోంది. హంద్రీ నీవా నీటిని జిల్లాలో చెరువులకు మళ్లించి బీడు భూములను ఆయకట్టుగా మార్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పందికోన రిజర్వాయర్ నుంచి ట్రయల్ రన్ నిర్వహించారు. దీంతో ఆయా చెరువుల కింద సాగు విస్తీర్ణం పెరగడంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు పుష్కలంగా లభిస్తోంది.





దేవనకొండ ఏరియల్ వ్యూ

మండలం	గ్రామ పంచాయతీలు	గతంలో బోర్లు	సాగు
దేవనకొండ	25	5,650	14,000 ఎకరాలు
మజరా గ్రామాలు	24	ప్రస్తుతం బోర్లు	సాగు
		8,150	21,000 ఎకరాలు

నాటి పరిస్థితి ఇదీ..
దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల, పి. కోటకొండ, దేవనకొండ, వరిముక్కల, బేతపల్లి, ఎం.కొట్టాల, చెల్లిచెలిమల, ఆలారుదిన్నె, కుంకనూరు, గద్దెరాళ్ల, నేలతలమర్రి, నెల్లిబండ..గతంలో ఫ్యాక్షన్ గ్రామాలుగా ఉండేవి. వర్గ విభేదాలతో ఆయా గ్రామాల్లో నిత్యం గొడవలు చోటుచేసుకునేవి. ఒకరిపై ఒకరు మారణాయుధాలతో దాడులు చేసుకునేవారు. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతికేవారు. కొందరు ఊర్లను విడిచి వెళ్లేవారు. పోలీసులు గ్రామాల్లోనే తిష్ట వేసి అల్లర్లు జరగకుండా చూసేవారు. ఫ్యాక్షన్ తగాదాల్లో అయిన వారిని కోల్పోయి.. అప్పులు జైలుపాలై గ్రామాల్లో సందడి కనిపించేది కాదు. గడపగడపలో భయం, అభద్రత, ఆందోళన కనిపించేంది.

నేడు ఇలా..
దేవనకొండ మండలంలో సన్న, చిన్న కారులు రైతులు దాదాపు 40 వేల మంది పైగా ఉన్నారు. హంద్రీ నీవా కాలువ ద్వారా పత్తికొండ మండలం పందికోన గ్రామ పంచాయతీ సమీపంలో నిర్మించిన రిజర్వాయర్‌కు



పందికోన రిజర్వాయర్

1.13 టీఎంసీల నీటిని నింపుతున్నారు. ఈ నీటిని కుడి, ఎడమ కాలువ ద్వారా పొలాలకు తరలిస్తున్నారు. కప్పట్రాళ్ల, పల్లెదొడ్డి, కరివేముల, పాలకుర్తి, నేలతలమర్రి, కరిడికొండ, దేవకొండ, కుంకనూరు, వెలమకూరు గ్రామాల్లోని పొలాలకు హంద్రీ-నీవా కాలువ నీరు అందుతోంది. రైతులు పత్తి, మిరప, ఉల్లి, వేరుశనగ..తదితర పంటలు సాగు చేస్తున్నారు. మొత్తం 52 వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయి. దేవనకొండ మండలంలో గత నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో చెరువుల కింద సాగు ఆశాజనకంగా కొనసాగుతోంది. హంద్రీనీవా కాలువ ప్రవహిస్తుండడం, చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల కింద మూడు పంటలు పండుతున్నాయి.

ఫ్యాక్షన్‌కు స్వస్తి
పంటలు సమృద్ధిగా పండుతుండడంతో దేవనకొండ మండలంలోని ప్రజలు ఫ్యాక్షన్‌కు స్వస్తి పలికారు. పిల్లలను బాగా చదివించుకుంటూ, వ్యవసాయ పనులు చేసుకుంటూ ప్రశాంత జీవనం గడుపుతున్నారు. ఫ్యాక్షన్ గ్రామాలైన కప్పట్రాళ్ల, పి. కోటకొండలో పెనుమార్పులు వచ్చాయి. దేవనకొండ మండలంలో 15,052 పొదుపు గ్రూపులు ఉన్నాయి. మహిళల ఆర్థిక స్వాలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం విరివిగా రుణాలను మంజూరు చేస్తోంది. దీంతో కొందరు మహిళలు పాడిపరిశ్రమలో రాణిస్తున్నారు. మరికొందరు జీవాల పెంపకాన్ని జీవనోపాధిగా ఎంచుకున్నారు. ఇంకొందరు కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించారు. కప్పట్రాళ్ల గ్రామంలో ప్రత్యేకంగా స్త్రీ శక్తి భవనాన్ని నిర్మించారు.

నరకం అనుభవించా
వెంకటప్ప నాయుడు హత్య కేసులో 2008లో నన్ను ముద్దాయిగా చేర్చారు. 2013 మార్చి 10వ తేదీన శిక్ష పడింది. దాదాపు ఏడేళ్ల జైలు జీవితాన్ని గడపాల్సి వచ్చింది. కుటుంబానికి దూరంగా ఉంటూ నరకాన్ని అనుభవించా. ప్రస్తుతం ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నా. నాకున్న ఐదు ఎకరాల భూమికి హంద్రీ నీవా నీరు వస్తున్నాయి. ఈ నీటితో పంటలు సాగు చేసుకుంటున్నా. గ్రామంలో ఫ్యాక్షన్ తగ్గిపోయి ప్రజలంతా ప్రశాంతంగా బతుకుతున్నారు.
– సందుపాలెం హనుమన్న, కప్పట్రాళ్ల గ్రామ రైతు

మహానేత కల సాకారం



మహానేత వైఎస్సార్ మేలును ఈ ప్రాంత ప్రజలు ఎన్నటికీ మరువరు. శ్రీశైల జలాలతో కరువు నేల దాహార్తి తీర్చాలనుకున్న ఆయన కల సాకారమవుతోంది. హంద్రీ నీవా నీరు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతోంది. ఒకప్పుడు ఫ్యాక్షన్‌తో ఎంతో పోగొట్టుకున్న ఈ ప్రాంత ప్రజలు వ్యవసాయమే ఆధారంగా సంతోషంగా జీవిస్తారు.
– రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

మార్పు ఊహించలేదు



గతంలో చాలా ఇబ్బందులకు గురయ్యాం. వర్షం వస్తే తప్ప పంటలను సాగు చేయలేని పరిస్థితి. గ్రామంలో గతంలో కొన్ని సమస్యలు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. హంద్రీ నీళ్లు రావడంతో రైతులంతా పంటలను సాగు చేసుకుంటూ ప్రశాంతంగా జీవిస్తున్నారు. ఈ మార్పును ఊహించలేదు. –మల్లికార్జున, కప్పట్రాళ్ల

చెరువులకు హంద్రీ-నీవా నీరు ఇస్తున్నాం
దేవనకొండ మండలంలో 12 చెరువులు ఉన్నాయి. కరివేముల, చెల్లిచెలిమల చెరువులకు, దేవనకొండలో రెండు చెరువులకు ట్రయల్ రన్ ద్వారా హంద్రీ-నీవా ద్వారా నీరు పంపించాం. కాలువ కింద ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందించాం. గతంలో బీడు ఉంచిన భూముల్లో సైతం రైతులు పంటలు పండిస్తున్నారు.
– తిమ్మారెడ్డి, ఎస్‌హెచ్‌హెచ్ డీఈ

న్యూస్‌రీల్

క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి



బాలుడిని పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించి వారిని ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం వెంకాయపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎన్ఆర్‌సీ కేంద్రానికి తరలించాలని సూచించారు. ఆయన వెంట డీసీఎం ప్రసాద్, ఎంపీహెచ్ఈవో వెంకటరమణ, సీహెచ్‌వో యశోద ఉన్నారు.

రేపు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో కారు దగ్ధం



శ్రీశైలం: దోర్నాల – శ్రీశైలం ఘాట్ రోడ్డులో శనివారం సాయంత్రం ఓ కారు దగ్ధమైంది. శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థమై విజయవాడ నుంచి వచ్చిన భక్తులు సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గ మధ్యలో తుమ్మలబైలు సమీపంలో కారు ఇంజిన్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడ్డాయి. కారులో ప్రయాణిస్తున్న నలుగురు భక్తులు భయంతో కిందకి దిగారు. అదే సమయంలో శ్రీశైలం వైపు వస్తున్న వాహనదారులు అప్రమత్తమై ప్రమాదానికి గురైన కారు డిక్కీలో ఉన్న సామగ్రిని బయటకు తీసేశారు. నిమిషాల్లో కారుకు మొత్తం మంటల వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. కాగా సంఘటనా స్థలం ప్రకాశం జిల్లా పరిధిలోకి రావడంతో దోర్నాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సైనికులూ.. సమస్యలు విన్నవించండి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయానికి ఈ నెల 17న ఆంధ్ర, తెలంగాణ సబ్ ఏరియా డిప్యూటీ జనరల్ కమాండింగ్ ఆఫీసర్ వస్తున్నారని జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సైనికులు తమ సమస్యలను రాతపూర్వకంగా విన్నవించాలని సూచించారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

- చివరి రోజున 327 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 3వ తేదీన మొదలై శనివారం ముగిశాయి. జిల్లాలో ఎక్కడ ఎలాంటి చిన్న సంఘటన కూడా చోటుచేసుకోలేదు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా విద్యాశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. మొత్తం 149 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా ప్రతి కేంద్రం పోలీస్ బందోబస్తు నియమించారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించలేదు. శనివారం నిర్వహించిన పరీక్షకు 29,579 మంది విద్యార్థులకుగాను 29,252 మంది హాజరుకాగా 327 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేంద్రాల దగ్గర కేరింతలు కొడుతూ గెంతులేశారు.

ముగిసిన ఓపెన్ స్కూల్ పరీక్షలు
ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం ప్రశాంతగా ముగిశాయి. మొత్తం 15 కేంద్రాల్లో చివరి రోజున పదో తరగతి పరీక్షలకు 827 మందికిగాను 726 మంది హాజరుకాగా 101 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్‌పరీక్షలకు 1429 మందికిగాను 1319 మంది హాజరుకాగా 110 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.



కర్నూలులో పరీక్షలు ముగిసిన అనంతరం కేరింతలు కొడుతున్న విద్యార్థులు

గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

- కేతవరంలో జగనన్న హౌసింగ్ కాలనీని పరిశీలించిన కలెక్టర్ సృజన

ఓర్వకల్లు: పేదల గృహ నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. కేతవరం గ్రామంలోని జగనన్న హౌసింగ్ కాలనీని శనివారం ఆమె పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పురోగతిపై హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 36 గృహాలు మంజూరు కాగా బేస్‌మెంట్ దశలో 11, బిలో బేస్‌మెంట్ దశలో 10, పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టినవి 15 ఉన్నాయని అధికారులు వివరించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన నగదుతో పాటు పొదుపు సంఘాల ద్వారా కొంత మేర రుణం తీసుకున్నామని లబ్ధిదారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వం సొంతింటి కల నెరవేర్చినందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. అనంతరం లబ్ధిదారుల పిల్లల చదువులు, వారి యోగక్షేమాలపై కలెక్టర్ ఆరా తీశారు. కాలనీ వాసులకు తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బిలో బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీఓలు సమీక్షలు నిర్వహించి బేస్‌మెంట్ స్థాయికి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలన్నారు. అర్హత ఉండి ఇంకా ఇంటి స్థలం లేని వారు దరఖాస్తు చేసుకున్నట్లయితే 90 రోజుల్లో పట్టా మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఈఈ నాగరాజు, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివ నాగప్రసాద్, గ్రామ సర్పంచు గోవర్ధన్ పాల్గొన్నారు.



హౌసింగ్ కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

పీపుల్స్ సర్వేలో 80 శాతం మంది సంతృప్తి

- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

కర్నూలు(సెంట్రల్): జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పీపుల్స్ పల్స్ సర్వేలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పనితీరుపై 80 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శనివారం వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామయ్యతో పాటు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, డాక్టర్ జే.సుధాకర్ మాట్లాడారు. రామయ్య మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి మొదలైన 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటా ప్రజలతో మమేకమై సీఎం జగన్ పాలనపై అభిప్రాయాలు తెలుసుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలను గెలుస్తామన్నారు. ప్రతిపక్ష పార్టీలు సీఎం జగన్‌ను విమర్శించేందుకే పాదయాత్రలు, యాత్రలు చేస్తున్నాయని, భవిష్యత్‌లో తీరు మారకపోతే తిరగబడతామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో మానవ వనరుల అభివృద్ధికి రూ. 2.30 లక్షల కోట్ల పెట్టుబడిగా పెట్టారన్నారు. మరో నాలుగైదేళ్ల గడిస్తే వాటి ఫలితాలు వస్తాయన్నారు. చంద్రబాబునాయుడు 14 ఏళ్ల సీఎంగా ఉన్నా రూ.5లక్షల కోట్లు కూడా సంక్షేమ, అభివృద్ధి పనులకు కేటాయించలేదన్నారు.

కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ దళితులను అవహేళన చేసి మాట్లాడుతున్నారని, ఈ విషయాన్ని గమనించకుండా టీడీపీలో ఉండే కొందరు దళిత నాయకులు తమను విమర్శించడం సిగ్గుచేటన్నారు. లోకేష్ దళితులకు క్షమాపణ చెప్పే వరకు పోరాటం చేస్తామని, ఆయన పాదయాత్రను అడ్డుకుంటామన్నారు.

నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లలో ఏపీలో 40 లక్షల కోట్లతో రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఓర్వకల్లులో 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్‌ను సిద్ధం చేస్తున్నామని, ఇది అభివృద్ధి కాదా అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుకారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సుభాష్‌చంద్రబోష్, కర్నూలు నియోజకవర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య. చిత్రంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు హాఫీజ్, సుధాకర్ తదితరులు

పొదుపు మహిళలకు వ్యక్తిగత రుణాలు

- సెర్ప్ సీఈఓ ఇంతియాజ్

కర్నూలు(అగ్రికల్చర్): పొదుపు మహిళలకు రూ.15 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేసే విధంగా ప్రభుత్వం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో ఒప్పందం చేసుకుందని సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్ఎండీ ఇంతియాజ్ తెలిపారు. జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న డ్వాక్రా బజారును శనివారం ఆయన తనిఖీ చేశారు. నిర్వహణ బాగుందని కితాబిచ్చారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన చిరుధాన్యాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం స్టాంటన్‌పురంలో సెర్ప్ సహకారంతో నెలకొల్పిన పసుపు, కారం పొడి తయారీ, ప్యాకింగ్ యూనిట్‌ను పరిశీలించారు. సీ క్యాంపు ప్రాంతంలో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజారును కూడా సీఈఓ సందర్శించారు. డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య , ఏపీడీ శ్రీధర్‌రావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సీతాబాయి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోని డ్వాక్రా బజారును జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి పరిశీలిస్తున్న సెర్ప్ సీఈఓ ఇంతియాజ్

బ్లాక్ మార్కెట్‌లో బీటీ–2 పత్తి విత్తనాలు

- ఎమ్మిగనూరు కేంద్రంగా సాగుతున్న దందా
- ఎమ్మార్పీపై రూ.300 అదనంగా వసూలు



యుఎస్ 7067 రకం బీటీ పత్తి విత్తన ప్యాకెట్

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాల జాడ లేకపోయినా బీటీ–2 పత్తి విత్తనాలకు డిమాండ్ ఏర్పడింది. ప్రధానంగా యుఎస్ 7067 రకం విత్తనాలు ఇప్పటి నుంచే బ్లాక్‌లో విక్రయిస్తుండటం గమనార్హం. గత ఏడాది కొన్ని రోజులు వర్షాభావం, మరికొన్ని రోజులు అధిక వర్షాలు, వాతావరణంలో మార్పులు తదితర కారణాలతో పత్తిలో దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. పలు బ్రాండెడ్ కంపెనీల విత్తనాలతో పత్తి సాగు చేసిన రైతులు నష్టాలు మూటకట్టుకున్నారు. యుఎస్–7067 బీటీ విత్తనాలతో పత్తి సాగు చేసిన రైతులు ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశాజనకంగా దిగుబడులు సాధించారు. యుఎస్ అగ్రిసీడ్ కంపెనీకి కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూటర్లు(పంపిణీదారులు) ఉన్నారు. రైతుల ఆసక్తిని గమనించిన డీలర్లు బ్లాక్‌లో అమ్మకాలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఎమ్మిగనూరులో ఈ బ్లాక్ మార్కెట్ దందా ఎక్కువగా సాగుతోంది. ఎంఆర్‌పీ రూ.853 ఉండగా.. ఎమ్మిగనూరులో రూ.1000–1200 మధ్య విక్రయిస్తున్నారు. అయితే బిల్లు మాత్రం రూ.853కే ఇస్తున్నారు. అయితే వ్యవసాయ యంత్రాంగం పట్టించుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ట్రాక్టర్ కింద పడి యువకుడి దుర్మరణం


నల్లమల(ఫైల్)

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం కానాల గ్రామ సమీపంలో శనివారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన గుంతల నల్లమల (30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆరు సంవత్సరాల క్రితం బేతంచెర్ల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన భూలక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. శనివారం ఉదయం గ్రామశివారులో ఉన్న చెరువులో మట్టిని ట్రాక్టర్‌లో నింపుకుని పొలానికి నల్లమల బయలుదేరాడు. పొలం రస్తాలో పెద్ద బండరాయిని ఎక్కించే క్రమంలో డ్రైవర్ సీటులో నుంచి జారి కింద పడ్డాడు. ఇంజిన్ వెనుక టైర్ తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ యజమాని ప్రమాదశాత్తూ మృతి చెందటంతో భార్య, కుటుంబ సభ్యులు కన్నీరు, మున్నీరుగా విలపించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పరిశ్రమల స్థాపనలో యువతకు ప్రాధాన్యం

- స్థానిక వనరుల వివరాలపై విస్తృత ప్రచారం
- పల్లెల్లో యుద్ధప్రాతిపదికన నీటి ఎద్దడి నివారణ పనులు
- స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



సమావేశాల్లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, హాజరైన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీలు

కర్నూలు(అర్బన్): పరిశ్రమల స్థాపనలో యువతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో శనివారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఏ మండలంలో ఎలాంటి వనరులు ఉన్నాయనే వివరాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై స్థానిక యువతకు అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుపై ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసయాదవ్ చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగం పెరగాల్సిన అవసరం ఉందని జెడ్పీ చైర్మన్ అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ఉత్సాహం చూపుతున్న లబ్ధిదారులకు అవకాశం కల్పించాలన్నారు.

చెరువులను బలోపేతం చేయాలి

కేసీ కెనాల్ ఆయకట్టుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు నీటిని అందించామని కేసీ కెనాల్ ఈఈ వీ తిరుమలేశ్వరరెడ్డి చెప్పడంపై చైర్మన్ పాపిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 68 చెరువులకు నీటిని ఎప్పుడు నింపుతారని జెడ్పీ చైర్మన్ ప్రశ్నించారు. ఇప్పటికే దాదాపు 40 చెరువులకు పైగా ట్రయల్ రన్ పూర్తి అయ్యిందని, ప్రస్తుతం కెనాల్‌లో నీరు లేనందున సెప్టెంబర్ నెలలో చెరువులకు నీటిని నింపే అవకాశాలు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు చెప్పారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే రెండు జిల్లాల్లోని చెరువుల్లో వివిధ రకాల పనులు చేపట్టాలని చైర్మన్ సూచించారు. చెరువు కట్టలను బలోపేతం చేయడం, తూములకు మరమ్మతులు చేపట్టడం వంటి పనులను పూర్తి చేయాలన్నారు.

జగనన్న తోడు అద్భుత పథకం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న తోడు అద్భుతమైన పథకమని జెడ్పీ చైర్మన్ అన్నారు. ఈ పథకం కింద చిరు వ్యాపారులకు రూ.10 వేలు ఇవ్వడం వల్ల వారిని అధిక వడ్డీల బారి నుంచి తప్పించినట్లవుతుందన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధి పొందేలా పథకాన్ని విస్తృత పరచాలన్నారు. ఈ ఏడాది మార్చిలో కురిసిన వడగండ్ల వానలతో పంటలు నష్టపోయిన రైతులకు పారదర్శకంగా పరిహారం అందేలా నివేదికలను ప్రభుత్వానికి పంపించారా? అని ఆయన వ్యవసాయ, ఉద్యాన వన శాఖలకు చెందిన అధికారులను ప్రశ్నించారు. పంటలు నష్టపోయిన రైతులందరికి పరిహారం అందేలా చూడాలన్నారు.

రూ.2.35 కోట్ల ప్రతిపాదనలకు త్వరలో ఆమోదం

ప్రస్తుత వేసవిలో రెండు జిల్లాల్లోని గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లకు జెడ్పీ చైర్మన్ సూచించారు. జిల్లా పరిషత్ నిధుల నుంచి ఒక్కో జెడ్పీటీసీ సభ్యుడికి రూ.5 లక్షలు కేటాయిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 47 మంది జెడ్పీటీసీల నుంచి అందిన రూ.2.35 కోట్ల ప్రతిపాదనలకు రెండు, మూడు రోజుల్లో పాలనా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు.

గైర్హాజరైన అధికారులకు నోటీసులు

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలకు, సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరు అవుతున్న నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులకు నోటీసులు జారీ చేయాలని సీఈఓ జీ నాసరరెడ్డిని జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, స్థాయీ సంఘాల చైర్‌పర్సన్లు దిల్షాద్ ముజాఫర్ నాయక్, పీ దివ్య, ఆర్‌అండ్‌బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు కే నాగరాజు, కే సుబ్రమణ్యం, బీ నాగేశ్వరరావు, సీహెచ్ మనోహర్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్ శ్రీనివాసకుమార్, డీఈఓ రంగారెడ్డి, సమగ్రశిక్ష అదనపు కోఆర్డినేటర్ డా. కే వేణుగోపాల్, డీఎంఅండ్‌హెచ్ఓ డా.రామగిడ్డయ్య, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

20న క్రికెట్ జట్టుకు ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఈనెల 20 వ తేదీ ఉదయం 10 గంటలకు అండర్–23 పురుషుల జిల్లా జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దేవేంద్రగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు సౌత్‌జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంటులో పాల్గొంటుందని పేర్కొన్నారు. 2000 సెప్టెంబర్ 1వ తేదీ తరువాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు నేరుగా ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

యువతి అదృశ్యం


అదృశ్యమైన యువతి

బనగానపల్లె: టంగుటూరు గ్రామానికి చెందిన గోరుగంటి శివమ్మ ఈనెల 14వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి వెంకటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నందివర్గం ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎంఎస్సీ చదివిన శివమ్మ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ప్రైవేట్ ఫిషరీస్ ల్యాబ్‌లో ఉద్యోగం చేస్తుందని, తల్లికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఈనెల 9వ తేదీన గ్రామానికి చేరుకుందన్నారు. కాగా 14వ తేదీన బ్యాంక్ పని నిమిత్తం బనగానపల్లెకు వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. బంధువుల ఇళ్ల వద్ద కుటుంబీకులు ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో యువతి తల్లి వెంకటమ్మ పోలీసులను ఆశ్రయించిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిసిన వారు 9121101098కు సమాచారం అందించాలని ఎస్‌ఐ తెలిపారు.

16 పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీల్లో మార్పు

- పలు పీఏసీఎస్‌లకు కొత్త చైర్‌పర్సన్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 16 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ముగ్గురు సభ్యుల నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీల్లో మార్పు చేశారు. కొన్ని సంఘాల్లో సభ్యులు మరణించడం, మరికొన్ని సంఘాల్లో రాజీనామా చేయడం తదితర కారణాలతో ఈ మార్పు చోటు చేసుకుంది.

కర్నూలు జిల్లాలో ఆరు పీఎస్‌సీఎస్‌లు, నంద్యాల జిల్లాలో ఆరు పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జి కమిటీల్లో మార్పులు, చేర్పులు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 13న జీవో 247 జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జీఓకు అనుగుణంగా సహకార శాఖ కమిషనర్ ఎండార్స్‌మెంటు ఇస్తే వీరు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని సహకార శాఖ అధికారులు తెలిపారు.

కర్నూలు జిల్లాలో..

- ఆలూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా హరిజన హనుమంతమ్మ.
- బెల్దోణ సొసైటీ చైర్‌పర్సన్‌గా యు.మల్లికార్జున, సభ్యులుగా పి.రంగస్వామి,కురువ రామాంజినప్ప.
- మద్దికెర పీఎస్‌సీఎస్ చైర్‌పర్సన్ వై.శాంతన్న, సభ్యులుగా బురుజుల వీరశేఖర్, బత్తిని హరిప్రసాద్.
- కౌతాళం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా డాట్ల క్రిష్ణంరాజు, సభ్యుడిగా బసవనగౌడు.
- సి.బెళగల్ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులుగా ఇ.నగేష్, బి.చిన్న రాముడు.
- పసుపల పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యునిగా కె.ఈశ్వరయ్య.

నంద్యాల జిల్లాలో..

- ప్యాపిలి మండలం హుస్సేనాపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా అలేబాదు గ్రామానికి చెందిన మేకల బాల అయ్యన్న.
- ఇప్పటివరకు చైర్‌పర్సన్‌గా కొనసాగిన సీమ సుధాకర్‌రెడ్డి జిల్లా సహకార కేంద్రబ్యాంకు పాలకవర్గం సభ్యుడిగా ఉన్నారు.
- గుండుపాపల సొసైటీలో ఇప్పటి వరకు సభ్యునిగా ఉన్న జి.బాల వెంకటరెడ్డి చైర్‌పర్సన్‌గా నియయామకం. సభ్యుడిగా కె.సుధాకర్.
- నాగంపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా జి.జనార్ధన్‌రెడ్డి, సభ్యులుగా తెలుగు చంద్రమోహన్, కలగొట్ల అచ్చిరెడ్డి.
- డోన్ పీఏసీఎస్‌లో సభ్యుడిగా ఉన్న తిరుమల్‌రెడ్డి చైర్‌పర్సన్‌గా నియామకం. సభ్యుడిగా డి.నరేంద్ర రెడ్డి.
- ప్యాపిలి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బోరెడ్డి రామచంద్రారెడ్డి.
- ఉయ్యాలవాడ పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి.

వీధి ఆవుకు చికిత్స


వైఎస్సార్ పశు సంచార వాహనంలో ఆవును తరలిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోటావీధిలో వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న ఆవులను మన ఊరు, మన గుడి–మన బాధ్యత నిర్వాహకులు గమనించి వాటిని పశు వైద్యశాలకు తరలించారు. నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వీధుల్లో తిరిగే గోవు ప్లాస్టిక్ కవర్ల తిని కడుపు ఉబ్బిపోయి అవస్థలు పడుతుండటంతో వైఎస్సార్ పశు సంచార వాహనానికి ఫోన్ చేయగా వారు వాహనంలో గోవును పశువైద్యశాలకు తరలించారు.

27న టూరిజం ప్రాజెక్టులకు వేలం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ దేవస్థానాలు, పర్యాటక ప్రాంతాల్లో నిర్మించిన టూరిజం ప్రాజెక్టులను పదేళ్ల కాలపరిమితితో లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 27వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు జిల్లా టూరిజం అథారిటీ అధికారి విజయ తెలిపారు. కాల్వబుగ్గ దేవాలయం బస్టాపు వద్ద నిర్మించిన ఏపీ టూరిజం రెస్టారెంట్, లక్ష్మీ జగన్నాథగట్టు(లక్ష్మీపురం) వద్ద నిర్మించిన డార్మిటరీ బ్లాక్, పార్క్, ఓర్వకల్లు మండలం కేతవరం రాతిచిత్రాల వద్ద నిర్మించిన టూరిజం రెస్టారెంట్, వెల్దుర్తి మండలం బ్రహ్మగుండం దేవాలయం బస్టాపు వద్ద నిర్మించిన టూరిజం డార్మిటరీకి వేలంపాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు జిల్లా కలెక్టర్ అండ్ చైర్మన్ జిల్లా టూరిజం కౌన్సిల్, కర్నూలు పేర మీద రూ.10వేలు డీడీ తీసి వేలంపాటకు ఒకరోజు ముందు తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయం పక్కన ఉన్న ఏపీ టూరిజం అథారిటీ కార్యాలయంలో వేలంపాట జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 6309924034. 8332848986ను సంప్రదించవచ్చని సూచించారు.